
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

సోమవారం 17 నవంబరు 2025

ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా త్రివిక్రంరెడ్డి




త్రివిక్రంరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ (జోన్4) అధ్యక్షుడిగా ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనపర్తి త్రివిక్రం రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఎన్‌జీవో భవన్‌లో ఆదివారం ప్రొటెం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు త్రివిక్రంరెడ్డి తెలిపారు. ఎన్నికల పరిశీలకుడిగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు విద్యాసాగర్ పర్యవేక్షించారన్నారు. ఈ సందర్భంగా త్రివిక్రంరెడ్డి మాట్లాడుతూ తనపై వుంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానన్నారు. నిరంతరం పారదర్శకతతో విద్యార్థుల శ్రేయస్సు, సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు. కాగా త్రివిక్రంరెడ్డిని రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ప్రిన్సిపాల్స్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మదనపల్లె జిల్లాలో 21 మండలాలు

- నాలుగు నియోజకవర్గాలు, రెండు రెవెన్యూ డివిజన్లు
- సబ్ కమిటీకి రెవెన్యూ శాఖ ప్రతిపాదనలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రతిపాదిత నూతన మదనపల్లె జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, రెండు రెవెన్యూ డివిజన్లు, 21 మండలాలు ఉండనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు పరిశీలన సబ్ కమిటీకి ఆదివారం నివేదిక సమర్పించింది. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో ఉన్న మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలకు అదనంగా చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరును కలిపి మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయనున్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు జతగా.. పీలేరు రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయనున్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో మదనపల్లె నియోజకవర్గానికి చెందిన మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దమండ్యెం, పెద్దతిప్పసముద్రం, కురబలకోట మండలాలు ఉండనున్నాయి. కొత్తగా ఏర్పడబోయే పీలేరు రెవెన్యూ డివిజన్‌లో ప్రస్తుతం రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో ఉన్న పీలేరు నియోజకవర్గానికి చెందిన గుర్రంకొండ, కలకడ, కేవీ పల్లె, పీలేరుతో పాటు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఉన్న వాయల్పాడు, కలికిరి, పుంగనూరు నియోజకవర్గం పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్న పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లోని పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలు ఉండనున్నాయి. నాలుగు నియోజకవర్గాలకు చెందిన 21 మండలాలు మదనపల్లె జిల్లాలో ఉండబోతున్నాయి. అయితే ఈ జిల్లాలో మరో రెండు మండలాలను చేర్చే విషయమై సుదీర్ఘంగా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. గత ఎన్నికల ప్రచారం సందర్భంగా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు.. రాష్ట్రంలో మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో నూతన జిల్లాల ఏర్పాటుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ప్రజల నుంచి అభ్యంతరాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల వినతులు, పరిపాలనా సౌలభ్యం దృష్టిలో ఉంచుకుని పలుచోట్ల రెవెన్యూ డివిజన్లు, మండలాలను మార్చనుంది. అదేవిధంగా కొత్త జిల్లాలను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకే రాష్ట్రమంత్రులతో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ సబ్‌కమిటీ ఈ విషయమై పలుమార్లు సమావేశమై ప్రజల నుంచి వినతులు స్వీకరించింది. ఈ సబ్ కమిటీకి ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రతిపాదిత మదనపల్లె జిల్లాలో ఉండబోయే అసెంబ్లీ నియోజకవర్గాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలపై నివేదికను సమర్పించింది.

సబ్‌జైలుకు కిడ్నీ రాకెట్ నిందితులు



మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో నిందితులు

మదనపల్లె అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):మదనపల్లెలో సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసు ఓ మహిళ హత్యకు కారణమైన నిందితులను పోలీసు లు ఆదివారం రిమాం డ్‌కు తరలించారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వా సుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకొచ్చి అక్కడ డాక్టరు పరీక్షలు నిర్వహించిన అనంతరం మదనపల్లె సబ్‌జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఇందులో డాక్టర్ ఆంజనేయులు, బాలరంగడు, మెహరాజ్, పిల్లిపద్మ, సత్య, సూరిబాబు ఉన్నారు.

అది రేటు...!

- ఆశాజనకంగా టమోటా ధరలు



ములకలచెరువు మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన టమోటాలు

ములకలచెరువు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో టమోటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మార్కెట్‌లో ఆదివారం 22 కేజీల బాక్సు రూ.700 నుంచి రూ.950 వరకు పలికాయి. వారం రోజుల క్రితం రూ.500 మాత్రమే పలికిన ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇటీవల తుఫాన్ల కారణంగా కురిసిన భారీ వర్షాలకు టమోటా తోటలు దెబ్బతిన్నాయి. అలాగే కాయలపై మచ్చలు వచ్చాయి. దీంతో టమోటాల దిగుబడి భారీగా తగ్గిపోయింది. 15 రోజుల క్రితం వరకు మార్కెట్‌కు 60 వేల బాక్సుల కాయలు అమ్మకానికి వచ్చేవి. ప్రస్తుతం కేవలం 10 వేల నుంచి 15 వేల బాక్సుల కాయలు మాత్రమే వస్తున్నాయి. అలాగే గతంలో ప్రతిరోజూ మార్కెట్ నుంచి 50 లారీల కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. ఇప్పుడు కేవలం 10 లారీల కాయలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. దీంతో టమోటా మార్కెట్ వెలవెలబోతోంది.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

రాయచోటి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించి బదిలీ అయిన సీఐల వివరాలిలా..

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎ.సత్యనారాయణ	మదనపల్లె రూరల్, అన్నమయ్య	వీఆర్, అనంతపురం
రవినాయక్	శ్రీసిటీ-3, పీఎస్, తిరుపతి	మదనపల్లె రూరల్
చంద్రశేఖర్	డీసీఆర్‌బీ, చిత్తూరు	రైల్వేకోడూరు పీఎస్
హేమసుందరరావు	రైల్వేకోడూరు పీఎస్,	పోరుమామిళ్ల సర్కిల్
శ్రీనివాసులు	పోరుమామిళ్ల సర్కిల్	రైల్వేకోడూరు సర్కిల్
వెంకటేశ్వర్లు	రైల్వేకోడూరు సర్కిల్	ఎస్‌బీ-3, అన్నమయ్య
ఏపీ మస్తాన్	గుంతకల్లు టూటౌన్ యూపీఎస్	రాజంపేట రూరల్
బీవీ రమణ	రాజంపేట రూరల్‌సర్కిల్	వీఆర్ రేంజ్ ఆఫీసు
టి.బాబు	ఒంటిమిట్ట సర్కిల్	ఎహెచ్‌టీయూ, అన్నమయ్య
నరసింహరాజు	వీఆర్ చిత్తూరు	ఒంటిమిట్ట సర్కిల్
రామచంద్ర	ఆర్‌ఎస్‌ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య	కలికిరి యూపీఎస్
చంద్రశేఖర్	సోషల్‌మీడియా అండ్ సైబర్ క్రైం సెల్, కడప	ఆర్‌ఎస్‌ఏఎస్‌టీఎఫ్
సురేశ్‌రెడ్డి	ఆర్‌ఎస్‌టీఎఫ్, అన్నమయ్య	కడప ట్రాఫిక్ పీఎస్
జావీద్	కడప ట్రాఫిక్ పీఎస్, కడప	సోషల్ మీడియా అండ్ సైబర్‌క్రైం, కడప
మోహన్‌కుమార్	వీఆర్, అన్నమయ్య	ఆర్‌ఎస్‌టీఎఫ్, అన్నమయ్య

19న సీఎం చంద్రబాబు రాక



కడప, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఈనెల 19న కమలాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డికి తెలియజేసినట్లు సమాచారం. కాగా సీఎం పర్యటన పెండ్లిమర్రి మండలమా, లేక వీఎన్‌పల్లె మండలమా అనేది ఇంకా ఖరారు కాలేదని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ఆదివారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ కడప చైర్మన్‌గా వెంకటేశ్వర్లు

- ప్రమాణ స్వీకారం చేసిన నూతన పాలకవర్గం



దీ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ కడప చైర్మన్‌గా ఎంపికైన అంబారపు వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

కడప (ఎడ్యుకేషన్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) కడప జిల్లా అధ్యక్షుడిగా ఏవీఆర్ టెక్నో స్కూల్స్ అధినేత ఇంజనీర్ ఎ.వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఆ శాఖ కార్యాలయంలో ఆదివారం జరిగిన 36వ సర్వసభ్య సమావేశం సందర్భంగా కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకున్న అనంతరం బాధ్యతలు స్వీకరించారు. గౌరవ కార్యదర్శిగా సహాయ గనుల అధికారి ఇంజనీర్ ఎం.వెంకటేశ్ బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గ సభ్యులుగా వైపీ వెంకటరమణయ్య, బి.వేణుగోపాల్, గంజికుంట గణేశ్, విపిన్ కుమార్ శర్మ, ఆర్.నరేంద్ర రావు, డి.లక్ష్మీపతి, వై.వెంకటరమణ, జి.కృష్ణకిషోర్, కె.ప్రసాద్, ఎం.షెహనాజ్, టి.లక్ష్మీభాస్కర్, ఓ.వాసుదేవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నూతన చైర్మన్ ఇంజనీర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ కడప కేంద్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గౌరవ కార్యదర్శి ఇంజనీర్ ఎం.వెంకటేశ్ మాట్లాడుతూ ఎలాంటి వివక్ష లేకుండా సెంటర్‌ను అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తానని తెలిపారు. నూతన పాలకవర్గ సభ్యుల సమక్షంలో మాజీ చైర్మన్ డాక్టర్ వి.ఆదినారాయణరెడ్డి నూతన చైర్మన్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ చైర్మన్లు, మాజీ గౌరవ కార్యదర్శులు, సభ్యులు తదితరులు కొత్తగా ఎన్నికైన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

- జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన టీచ్ టూల్ ట్రైనింగ్ ఈనెల 17, 18వ తేదీల్లో మండల స్థాయి లెవెల్-2 శిక్షణ ఉంటుందని డీఈవో సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో బోధన నాణ్యతను పెంపొందించడానికి గతంలో ఈ 61 మంది డీఆర్పీలకు శిక్షణ ఇచ్చామని, గతంలో శిక్షణ పొందిన డీఆర్పీలు జిల్లాలోని 30 మండలాల్లో పనిచేస్తున్న 597 మంది ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు టీచ్ టూల్ లెవెల్-2పై శిక్షణ ఇస్తారని తెలిపారు. తరగతి గదుల్లో విద్యార్థులు ఆకర్షితులయ్యే విధంగా బోధన పద్ధతులను అభివృద్ధి చేయడం, ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాలను పెంపొందించడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఆధునిక విద్యా అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేయడంలో ఈ శిక్షణ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. మండల విద్యాశాఖాధికారులు అందరూ కలిసి మండల స్థాయి ట్రైనింగ్ ప్రోగ్రాంను విజయవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

దక్షిణాఫ్రికాలో చిత్రహింసలు పెడుతున్నారు

- మా కుమారుడ్ని చంపేస్తారేమోనని భయంగా ఉంది
- రూ.30 లక్షలు పంపితే ఇంటికి వచ్చేలా చేస్తామని బెదిరింపులు
- ప్రభుత్వాన్ని కోరుతూ కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు



తమ కుమారుడిని దేశానికి రప్పించాలని కోరుతున్న తల్లిదండ్రులు



నగేశ్‌కుమార్ (ఫైల్)

ములకలచెరువు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం దక్షిణాఫ్రికాకు వెళ్లిన మా కుమారుడిని నిర్బంధించి చిత్రహింసలు పెడుతున్నారు... 16 రోజులుగా తిండి కూడా సరిగ్గా పెట్టడం లేదు... చంపేస్తారేమో భయంగా ఉంది... రూ.30 లక్షలు పంపితే క్షేమంగా ఇంటికి పంపుతామని లేదంటే చంపేస్తామని బెదిరిస్తున్నారు... ఒక్కగానొక్క తమ కుమారుడిని ఇండియాకు రప్పించాలని... లేదంటే ఇద్దరం ఆత్మహత్య చేసుకుంటామని ములకలచెరువుకు చెందిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ మేరకు ములకలచెరువులోని తమ ఇంటి వద్ద ఆదివారం విలేకరులకు విషయాన్ని తెలియజేశారు. పెద్దతిప్పసముద్రంకు చెందిన నాగరాజు తంబళ్లపల్లె వీఆర్‌వోగా పనిచేస్తున్నాడు. ఈయనతో పాటు ఇతడి కుటుంబం గత కొన్నేళ్ళుగా ములకలచెరువులోని పీటీఎం రోడ్డులో నివాసముంటోంది. ఇతనికి భార్య మంజుల, కుమార్తె కౌసల్య, కుమారుడు నగేశ్‌బాబు ఉన్నారు. రెండేళ్ల క్రితం కుమార్తెకు వివాహం చేశారు. కుమార్తె వివాహానికి అప్పులు చేయడంతో తీర్చడానికి ఇబ్బందులు పడుతున్నారు. పెద్దమండ్యంకు చెందిన మహబూబ్‌బాషా కుమారుడు సాబ్జాన్ దక్షిణాఫ్రికాలో పనిచేస్తూ ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో వీఆర్‌వో నాగరాజుకు సాబ్జాన్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో తమ కుమారుడు నగేశ్‌బాబును కూడా అక్కడికి తీసుకెళ్లి ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరాడు. ఈ నేపథ్యంలో తాను పనిచేస్తున్న మొక్కజొన్నల ఫ్యాక్టరీలో ఉద్యోగం ఉందని చెప్పడంతో రూ.2లక్షలు ఖర్చు చేసి నాగేశ్‌బాబును ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ దక్షిణాఫ్రికాలోని లిలోంగ్వేకు పంపాడు.

అక్కడ మొక్కజొన్నల ఫ్యాక్టరీలో ఇద్దరూ సెక్యూరిటీ గార్డులుగా పనిచేసేవారు. అక్కడ ఫ్యాక్టరీ యజమాని కూడా ఇండియాకు చెందిన రాజ్ మున్నంగి కావడంతో బాగానే ఉండేది. ఉన్నట్లుండి ఫ్యాక్టరీలో బస్తాలు మాయమయ్యాయని, మీరే చేశారంటూ యజమాని ఆ ఇద్దరిని ఓ గదిలో బంధించి చిత్రహింసలు పెట్టడం ప్రారంభించాడు. ఇలా 16 రోజులుగా చిత్రహింసలు పెడుతూ గదిలో బంధించి సెల్‌ఫోన్లు లాక్కొని తాళం వేసుకెళ్లేవాడు. ప్రతిరోజూ నగేశ్‌బాబు సెల్‌ఫోన్ నుంచి వీఆర్‌వో నాగరాజుకు ఫోన్ చేసి మీ కుమారుడు ఫ్యాక్టరీలో దొంగతనం చేశాడని, రూ.30 లక్షలు పంపితే వదిలిపెడతానని లేదంటే చంపేస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నాడు. అప్పుడప్పుడు తన కుమారుడికి ఫోన్ ఇచ్చి మాట్లాడిస్తుడడంతో భోరున విలపిస్తున్నాడని నాగరాజు, మంజుల కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఈ విషయమై వీఆర్‌వో దక్షిణాఫ్రికాలోని ఇండియన్ ఎంబసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణం స్పందించిన అధికారులు మొక్కజొన్నల ఫ్యాక్టరీ యజమాని రాజ్ మున్నంగిని పిలిపించి విచారించారు. ఎంబసీ అధికారులు విచారించడంతో రాజ్ మున్నంగి తమ కుమారుడిని ఎక్కడికో తీసుకెళ్లిపోయాడని, అతడి ఫోన్ కూడా పనిచేయడం లేదని, ఎక్కడికైనా తీసుకెళ్లి చంపేశాడేమోనన్న అనుమానం కలుగుతోందని నాగరాజు, మంజుల భోరున విలపించారు. ఈ విషయాన్ని ఎంబసీ అధికారుల దృష్టికీ తీసుకెళ్ళానని, తమ కుమారుడు నగేశ్‌బాబుతో పాటు పెద్దమండ్యంకు చెందిన సాజ్జాన్, మరో ముగ్గురిని నిర్బంధించారని చెబుతున్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

- భారీగా తరలివచ్చిన ప్రజలు
- హిందూ కార్తీక వనభోజనానికి అనూహ్య స్పందన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రవచనం చేస్తున్న స్వరూపానందస్వామి



స్వామివారి కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

కడప కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. నగర శివారులోని లలితా పంచాయతన ఆలయంలో ఆదివారం ఉదయం 8-30 నుంచి 10-30 వరకు సాగిన శివపార్వతుల కల్యాణం ఆద్యంతం కనుల పండువగా నిర్వహించారు. ప్రజలు ఆది దంపతుల కల్యాణోత్సవాన్ని తిలకించి భక్తి పారవశ్యం పొందారు. అంతకుముందు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు లలితా పంచాయతన దేవాలయంలోని కంఠేశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం 108 కలశ జలాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణగా తీసుకు వచ్చి స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం ఉదయం 10-30 నుంచి 12-15 వరకు పీఠాధిపతులు, స్వామీజీలు, ప్రముఖులు, పెద్దలచే నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రజలను ఆలోచింపచేశాయి. ఇందులో ప్రధానంగా లలితాపీఠం, వశిష్టాశ్రమం శ్రీనివాస మంగాపురం (తిరుపతి) వ్యవస్థాపకుడు స్వరూపానందస్వామి, అచలానంద ఆశ్రమం (తోట్లపల్లి-బ్రహ్మంగారి మఠం) వ్యవస్థాపక అధిపతులు విరజానందస్వామి, ఇస్కాన్ ప్రతినిధి వైష్ణవ కృపదాస్ చేసిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి.


అనంతరం నిర్వహించిన హిందూ కార్తీక వనభోజనం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. స్వామి చిన్మయానందజీ దివ్య ఆశీస్సులతో లలితా పంచాయతన దేవాలయం స్వామి తురియానంద సరస్వతి నేతృత్వంలో హిందూ కార్తీక వనభోజన కమిటీ ప్రతినిధుల సారథ్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. చిన్మయ మిషన్, ఏపీ జిల్లా గణేష్ ఉత్సవ సమితి, జిల్లా అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి, మహాదేవుని మహా శోభాయాత్ర కమిటీ, అయోధ్య శ్రీరామ శోభాయాత్ర కమిటీ ప్రతినిధుల సౌజన్యంతో చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు తండోపతండాలుగా హాజరయ్యారు. కమిటీ ప్రతినిధులు వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వనభోజన కార్యక్రమం అనంతరం వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, హిందూ ధార్మిక వనభోజన కమిటీ ప్రతినిధులు బండి పిచ్చిరెడ్డి, బొమ్మిశెట్టి చంద్రశేఖర్, లెక్కల కొండారెడ్డి, విజయానందరెడ్డి, రామమహేష్, వారణాసి శ్రీధర్‌శర్మ, చెన్నకృష్ణారెడ్డి, బండారు శివకేశవ్‌లతో పాటు పలువురు హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కల్యాణానికి హాజరైన మహిళలు

ఆ మలుపులు.. మృత్యు పిలుపులు

నిండు నూరేళ్లు జీవించాల్సినవారు ఆ మలుపుల వల్ల వారి జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. సురక్షితంగా తమ గమ్యానికి చేరుకుంటున్నాము అనుకొనేలోపే ఆ మలుపులు.. మృత్యు పిలుపులుగా మారుతున్నాయి. అంతవరకు సంతోషంగా ఉన్న ఆ కుటుంబాలు మలుపుల రూపంలో విషాదాన్ని నింపుతున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. గత రెండు సంవత్సరాల కాలంలో ఆ మలుపుల వద్ద 20 నుంచి 25 ప్రమాదాలు జరగగా 10 నుంచి 15 మంది మరణించారు. అనేక మంది కాళ్లు, చేతులు పోగొట్టుకొని అవిటి వారైన సంఘటనలు ఉన్నాయి.


బొందాలవంక వద్ద ఉన్న మలుపు


గోరాన్‌చెరువు మలుపులో రాయచోటి-గాలివీడు రోడ్డు మలుపు

● గాలిలో కలిసిపోతున్న ప్రజల ప్రాణాలు ● పట్టించుకోని అధికారులు

గాలివీడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని రోడ్ల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారి యమపాశాలుగా తయారయ్యాయి. ముఖ్యంగా గాలివీడు-కదిరి రోడ్డు మార్గంలోని వెలిగల్లు కాలనీ వద్ద, గుర్రాలమిట్ట వద్ద ఏడాదికి సరాసరి 5 నుంచి 10 ప్రమాదాలు జరుగుతున్నాయి. గాలివీడు-రాయచోటి మార్గంలోని ఎగువగొట్టివీడు పంప్‌హౌస్ సమీపంలో ఉన్న మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కరిమిరెడ్డిగారిపల్లె క్రాస్ రోడ్డులోని గంగమ్మ గుడి, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ఉన్న మలుపుల్లో ఏడాది క్రితం జరిగిన ఆటో ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోగా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. రెండు రోజుల క్రితం ఒడిసెలవంకపల్లె వద్ద జరిగిన ప్రమాదంలో వరుణ్‌కుమార్ మరణించాడు. ఆగస్టు, సెప్టెంబరు నెలలోనే వివిధ మలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మరణించగా 8మందికి తీవ్రగాయాలయ్యాయి. అరవీడు రోడ్డు మార్గంలో ఎల్లంపల్లె, ఆంజనేయస్వామి, ఇతర మలుపుల వద్ద, గాలివీడు-కోనంపేట రోడ్డు మార్గంలోని పేరంపల్లి మిట్ట, గొందిపల్లె క్రాస్ వద్ద ఏడాదికి 10 నుంచి 15 ప్రమాదాలు జరుగుతున్నాయి. నూలివీడు పంచాయతీ బొందలవంక 'ఎస్' ఆకారంలో ఉండడం వల్ల, అలాగే మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడం, ఇంకొన్ని మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడకుండా వృక్షాలు అడ్డంగా ఉండటం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మలుపులు లేని రోడ్లు ఏర్పాటు చేయాలి..

మండలంలోని కొన్ని రోడ్డు మలుపులు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. రోడ్డుపై అవగాహన లేనివారు, కొత్తవారు ఈ మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. గుర్రాలమిట్ట, గోరాన్‌చెరువు పంచాయతీల్లోని మలుపుల వద్ద, బొందలవంక, గొందిపల్లె మలుపుల వద్ద తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువ మలుపులు లేని రోడ్డును ఏర్పాటు చేయాలి.

- నరసారెడ్డి, గాలివీడు



సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

మండలం గుండా వివిధ జిల్లాలను కలుపుతూ ఉన్న ప్రతి రహదారిలోనూ మలుపులు ఉన్నాయి. అయితే చాలా మలుపుల వద్ద సూచిక బోర్డులు లేవు. దీంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మరికొన్ని మలుపుల వద్ద పెద్ద చెట్లు అడ్డంగా ఉన్నాయి. అధికారులు స్పందించి చెట్లను తొలగించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

- దేవేంద్ర, నాగూరివాండ్లపల్లె

క్వార్టర్ ఫైనల్ చేరుకున్న బేస్‌బాల్ జట్లు

రైల్వేకోడూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బుడుగుంటపల్లె పరిధిలో ఉన్న జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీలలో ఆదివారం పలు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర పోటీలలో నెల్లూరు-ఈస్ట్ గోదావరి పైన 0-9, అనంతపురం-కడప పైన 5-3, శ్రీకాకుళం-కర్నూలు జట్టు పైన 6-1, విశాఖపట్నం-కృష్ణా పైన 6-2, చిత్తూరు-ప్రకాశం జట్టుపై 5-2, అనంతపురం-ఈస్ట్ గోదావరి జట్టుపై 4-3, కడప-నెల్లూరు జట్టుపై 5-1, విజయనగరం-శ్రీకాకుళం జట్టుపై 2-1, వెస్ట్ గోదావరి-కృష్ణ జట్టుపై 8-0, గుంటూరు-చిత్తూరు జట్టుపై 6-4, నెల్లూరు-అనంతపురం జట్టుపై 7-6, కడప-ఈస్ట్ గోదావరి జట్టు పై 12-1, కర్నూలు-విజయనగరం జట్టు పై 12-1, విశాఖపట్నం-వెస్ట్ గోదావరి జట్టు పై 10-0 స్కోర్‌తో లీగ్ దశలో విజయం సాధించినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగం ఆర్గనైజింగ్ కార్య దర్శి చంద్రమోహన్ రాజు తెలిపారు. బాలికల విభాగంలో ఈస్ట్ గోదావరి- అనంతపురం జట్టుపై 12-0, చిత్తూరు-ప్రకాశం జట్టుపై 10-5, నెల్లూరు- విశాఖపట్నం జట్టుపై 10-0, కర్నూలు-అనంతపురం జట్టుపై 11-1, కడప-ఈస్ట్ గోదావరి జట్టుపై 14-8, విజయనగరం-కృష్ణా జట్టుపై 15-12, శ్రీకాకుళం- చిత్తూరు జట్టుపై 12-1, గుంటూరు-నెల్లూరు జట్టుపై 7-3, కడప-అనంతపురం జట్టుపై 13-3, కర్నూలు-ఈస్ట్‌గోదావరి జట్టుపై 11-2, శ్రీకాకుళం-ప్రకాశం జట్టుపై 8-1 స్కోర్‌తో విజయం సాధించినట్లు తెలిపారు. పూల్-ఏలో గుంటూరు, నెల్లూరు, పూల్-బీలో శ్రీకాకుళం, చిత్తూరు జట్లు, పూల్-సీలో విజయనగరం, కృష్ణా, పూల్-డీలో కర్నూలు, కడప జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయన్నారు. అలాగే బాలురు విభాగంలో పూల్-ఏలో గుంటూరు, చిత్తూరు, పూల్-బీలో విశాఖపట్నం, వెస్ట్‌గోదావరి, పూల్-సీలో కర్నూలు, శ్రీకాకుళం, పూల్-డీలో కడప, నెల్లూరు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయని తెలిపారు. సోమవారం క్వార్టర్ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలను నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్‌లో జిల్లా క్రీడాకారులకు 17 పతకాలు



సత్తా చాటిన జిల్లా వెయిట్ లిఫ్టర్లు

కడప స్పోర్ట్స్, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కొండవెలగడ గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల, బాలికలు, మహిళలు, పురుషుల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లాకు చెందిన వెయిట్‌లిఫ్టర్లు 17పతకాలు సాధించినట్లు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ నారాయ ణరావు వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 5 బంగారు, మరో 5 వెండి, 7 బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన షేక్ షావల్లి

రాజంపేట టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం ఉస్మాన్‌నగర్‌కు చెందిన షేక్ షావల్లి(28) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గొడవ పడి భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడు షేక్ షావల్లి డ్రైవర్‌గా పనిచేసేవాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కలసపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముసల్‌రెడ్డిపల్లె రహదారిలో ఉన్న ఎస్టీ కాలనీలో ఆదివారం అన్నపురెడ్డి శ్రీనివాసులు అలియాస్ దొమ్మరోళ్ల శ్రీను (45) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... శ్రీను గత కొన్ని సంవత్సరాల నుంచి భార్యకు దూరంగా ఉంటూ కాలనీలో ఉంటున్నాడు. మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరుగుతూ ఒంటరిగా బతుకుతున్నాడు. మృతుడి కాళ్లకు తాళ్లు ఉండడం, కాళ్లు నేలకు ఆనుకొని ఉండడంతో ఎవరైన చంపి ఉరి వేశారా అనే అనుమానం పోలీసులు, స్థానికుల్లో నెలకొంది. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని విద్యార్థి మృతి


మృతి చెందిన మహేశ్

కడప క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్‌లో రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్సు బండి ఢీకొనడంతో ఎంబీఏ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. నంద్యాల జిల్లా బనగానపల్లె దేవినగర్‌కు చెందిన ఎం.మహేశ్ (21) కడప రాయచోటి రోడ్డులోని ఇంజనీరింగ్ కాలేజీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రైలు ఎక్కేందుకు ట్రాక్ దాటుతుండగా వేగంగా వచ్చిన గూడ్సు రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతుడిని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తు న్నట్లు తెలిపారు.

పుష్పగిరిలో 20 శాసనాల నకళ్ల తయారీ


శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తుశాఖ సిబ్బంది

వల్లూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యంత ప్రసిద్ధి చెందిన దక్షిణ కాశీ, పంచమనదీ క్షేత్రం పుష్పగిరి వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో 20 శాసనాల నకళ్లను ఆదివారం తమిళనాడు రాష్ట్రం చెన్నై నుంచి వచ్చిన భారత పురావస్తుశాఖ తయారు చేసిందని రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేశ్ తెలిపారు. పుష్పగిరి దేవాలయాల శాసనాలు దాదాపు కాపీ చేసినప్పటికీ ఎన్నో ఆలయాల శాసనాలు శిథిలమై అప్పుడప్పుడూ కొన్ని భారీ వర్షాలకు బయటపడుతున్న వాటిని వెలుగులోకి తీసుకువస్తున్నామన్నారు. అక్టోబరు 20న నాగేశ్వరస్వామి ఆలయం శాసనాలు వెలుగులోకి తెచ్చానని, దీనికి స్పందించిన భారత పురావస్తుశాఖ డైరెక్టరు మునిరత్నం రెడ్డి చెన్నై ఏపీ గ్రఫీ కార్యాలయ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.ఏసుబాబుకు చెప్పారని ఆయన అన్నారు. ఏసుబాబు తన సిబ్బందిని పురమాయించగా ఆదివారం చెన్నై నుంచి వచ్చినవారు పుష్పగిరిలో శుభ్రపరచి నవీకరించిన శాసనాల్లో 13వ శతాబ్దానికి చెందిన తమిళం, గ్రాంధిక లిపి కలిపి ఉందని వివరించారు. ఈ గ్రామం త్రిభువనా వీర చతుర్వేది మంగళంలో భాగమై ఉందని, త్రిభువన వీర అనే పదం కులోతుంగ చోళ 3 బిరుదుల్లో ఒకటన్నారు. ఒక శాసన శకలం నుంచి రాజేంద్ర చోళ దేవరని అతను పొత్తాబి చోళ రాజేంద్రుడనే వివరణ ఉందని చెప్పారు. శాసనాలు ఎక్కువగా ముక్కలుగా పాడైపోయి ఉన్నాయని వివరించారు. అత్యంత ప్రాచీనమైన కఠినమైన తమిళ, గ్రాంధిక లిపిలో ఉండడంతో వీటిని సులువుగా చదవడానికి వీలు లేకుండా పోయిందని, సేకరించిన వాటిని చెన్నైకి తీసుకెళ్లి అక్కడ నుండి మైసూరు ఏపీగ్రఫీ కార్యాలయానికి తీసుకెళ్లి క్షుణ్ణంగా చదవాలని చెప్పారు. శాసనాల్లో మరింత సమాచారం కోసం కొంత సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో చెన్నై ఏపీగ్రఫీ కార్యాలయ అసిస్టెంట్ ఏపీ గ్రాపిస్ట్ వీరమణి కందన్, ఎస్టాం పేజ్ మెకానిక్‌లు ఏఏ మణికంఠన్, ఏ.కార్తవరాయన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని యువతి ఆందోళన


పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న యువతి

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కోడూరు మండలంలోని శెట్టిగుంట గ్రామానికి చెందిన షేక్ యాస్మిన్ అనే యువతి ఆదివారం పోలీస్‌స్టేషన్ వద్ద పెట్రోల్ పోసుకుని ఆందోళన చేపట్టింది. తన భర్త షేక్ అఫ్సర్ తనకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్నాడని, ఈ విషయమై తాను రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఆమె వెల్లడించింది. శుక్రవారం ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇప్పటివరకు స్పందించలేదని, దీంతో తనకు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. ఈ సంఘటనపై సీఐ హేమసుందర్‌రావును వివరణ కోరగా యువతి ఇప్పటివరకు తన భర్త రెండో వివాహం చేసుకున్నట్లు ఆధారాలు సమర్పించలేదని, యువతి ఇచ్చిన ఫిర్యాదుపై కోర్టు అనుమతి తీసుకుని కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

బాలుడు అదృశ్యం



కడప క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కడప నగరం బముజన్ నగర్‌కు చెందిన బాలుడు అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. బహుజన్‌నగర్‌కు చెందిన అల్లం నందుకుమార్ 8వతరగతి చదువుతున్నాడు. గత నెల 23న స్కూలుకు వెళ్లాక ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీని నమ్మి మోసపోయాం

● వెంకటరెడ్డిని శిక్షించండి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీని నమ్మి మోసపోయమని, నిందితుడు వెంకటరెడ్డిని కఠినంగా శిక్షించాలని మదనపల్లెకు చెందిన లక్ష్మీతాయారమ్మ, కర్నూలుకు చెంది కౌశిక్ కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ అమెరికా కొలంబస్ సెంట్రల్ యూనివర్సిటీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ జాయిన్ చేయిస్తామని హైదరాబాద్‌కు చెందిన ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీ నిర్వాహకులు మారెడ్డి వెంకటరెడ్డి, చైతన్య విద్యార్థుల వద్ద డబ్బు వసూలు చేశారని తెలిపారు. ఆ కళాశాలలో చదవకపోయినా సర్టిఫికెట్లు ఇస్తారని నమ్మించారన్నారు. తీరా బ్యాంకు రుణం కోసం వెళ్లగా ఆ కళాశాలకు ఎలాంటి గుర్తింపు లేదని తేలిందన్నారు. దీనిపై కన్సల్టెన్సీ నిర్వాహకులను సంప్రదిస్తే 'డబ్బు తిరిగి ఇచ్చేది లేదు.. ఏం చేస్తారో చేసుకోండి' అంటూ బెదిరించారన్నారు. తెలంగాణ సీఎం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాధితులు

అప్పుల బాధతో రైతు మృతి

● విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి

దువ్వూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఇడమడక గ్రామానికి చెందిన ఎం.సుబ్బరాయుడు (67) అనే రైతు అప్పుల బాధ భరించలేక గడ్డిమందు తాగి శనివారం మృతిచెందాడు. ఎస్‌ఐ ధనుంజయుడు తెలిపిన వివరాల మేరకు వ్యవసాయం నేపథ్యంలో సుబ్బరాయుడు సుమారు రూ.10లక్షల దాకా అప్పులు చేశాడన్నారు. వాటిని తీర్చలేనేమోననే భయంతో ఈనెల 4వ తేదీ అతను గడ్డి మందు తాగాడన్నారు. వెంటనే చికిత్స నిమిత్తం అతన్ని కర్నూలుకు తరలించగా అక్కడ ఆసుపత్రిలో పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతిచెందాడని ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. రైతు సుబ్బరాయుడుకు 3 ఎకరాలు పొలం ఉండగా అదనంగా ఏడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాడన్నారు. దీంతో అప్పులు సుమారు రూ.10లక్షలు ఉండడంతో ఆత్మహత్య కు పాల్పడ్డాడన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వాల్మీకిపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గంగాదొడ్డి వాసి శ్రీరాములు(58) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై వెళ్తూ ఆటో ఢీకొనడంతో గాయపడిన శ్రీరాములును చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకోండి

● శిల్పారామాన్ని తనిఖీ చేసిన సీఈవో స్వామినాయుడు


శిల్పారామం పరిసరాలను పరిశీలిస్తున్న సీఈవోస్వామినాయుడు

పులివెందుల రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన శిల్పారామంలో సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదర్శనలు నిర్వహించాలని శిల్పారామం సీఈవో వి.స్వామినాయుడు సూచించారు. పట్టణంలోని శిల్పారామాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. శిల్పారామమంతా కలియతిరిగి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ శిల్పారామంలో పచ్చదనం, పరిశుభ్రత ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అలాగే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఉలిమెల్ల లేక్‌ను పరిశీలించి ప్రతి ఆదివారం, పండుగ రోజులలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి సందర్శకుల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి, ఫీల్డ్ సూపర్వైజర్ సుబ్బారావు, ఉలిమెల్ల లేక్ సూపర్వైజర్ వరప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పెట్టుబడుల వెల్లువ : చమర్తి

రాజంపేట టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని రాజంపేట టీడీపీ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఏపీని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. విశాఖ వేదికగా నిర్వహించిన పెట్టుబడిదారుల సమావేశంలో పలువురు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారన్నారు. కూటమి ప్రభుత్వంలో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు. రాజంపేట పట్టణం పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సానుకూలమైన ప్రదేశం అన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్లలో ఈ ప్రాంత అభివృద్ధికి ఏమీ చేయలేదని, ఆయన విధ్వంసకర విధానాలకు భయపడి పలువురు పెట్టుబడిదారులు కంపెనీలను మూసివేసి రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోయారని విమర్శించారు. ప్రజలు అప్పటి ప్రభుత్వ వైఖరిని, ఇప్పటి ప్రభుత్వ విధానాన్ని క్షుణ్ణంగా గమనించి ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మార్కెట్‌యార్డు చైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు, రాజంపేట పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యం నాయుడు, రూరల్ అధ్యక్షుడు మేడికొండు రవి నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, రాజంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడరు తుపాకుల అశోక్, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, రాజంపేట ఎస్సీ నాయకుడు మందా శ్రీను, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● ప్రజా దర్బార్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులతో పాటు అధికారులు కూడా కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి క్యాంపు కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలు విని, తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.


ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పంచముఖి విఘ్నేశ్వరాలయంలో పూజలు

రాజంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస ఆదివారం సందర్భంగా రాజీవ్‌స్వగృహ ముఖద్వారంలోని పంచముఖ విఘ్నేశ్వరాలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు హాజరు కాగా ఆయనకు వేదపండితులు పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హరేరామ హరేకృష్ణ ట్రస్టు సభ్యులు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లె ప్రతాప్‌రాజు, టీడీపీ రూరల్ అధ్యక్షుడు మేడికొండు రవినాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు

నేడు మూలస్థానేశ్వరాలయంలో రుద్రాభిషేకం

రామాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసనాపురం పంచాయతీ పరిధిలోని శ్రీపార్వతీ పరమేశ్వర మహాక్షేత్రం గంగాభవానీ సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం 6 గంటలకు ఆకాశదీపం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయంలో అయ్యప్ప పండుస్వామి, అయ్యప్ప భక్తులు అన్నదానం చేస్తున్నారని తెలిపారు.

దర్గా స్వామీజీ ఆశ్రమంలో నేడు రుద్రాభిషేకం

రామాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ శ్రీ సాయినగర్‌లోని సమర్థ సద్గురు దర్గా స్వామీజీ, దర్గా మాతాజీ ఆశ్రమంలో సోమవారం ఉదయం 10 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, మధ్యాహ్నం 1 గంటకు దర్గా మాతాజీ పంచవటిలో వనభోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు శంకరయ్యస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజలు, మహిళలు, భక్తులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు నాగులకట్ట వద్ద వనభోజనం

రాజంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా స్థానిక నాగులకట్ట వద్ద సోమవారం వన భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మన్నూరు గ్రామ ప్రజలు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని వారు కోరారు.

ఒంటిమిట్ట సీఐ బాబు బదిలీ

ఒంటిమిట్ట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట సీఐ బాబు బదిలీపై వెళ్లారు. ఈయన అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఒంటిమిట్ట సీఐగా చిత్తూరు వీఆర్‌లో ఉన్న పి.నరసింహ రాజును నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

ఎద్దు మృతికి విద్యుత్ షాక్ కారణం కాదు : ఏఈ

పెనగలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలగచర్ల గ్రామ పరిధిలో ఈనెల 11న జరిగిన సంఘటనలో శ్రీహరి నాగరాజు అనే వ్యక్తికి చెందిన ఎద్దు విద్యుత్‌షాక్‌తో చనిపోలేదని పెనగలూరు మండల విద్యుత్ ఏఈ ఆర్.ఓబుల్ రెడ్డి తెలిపారు. ఈనెల 12న ప్రచురితమైన విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి వార్తకు స్పందించి వెలగచర్ల గ్రామానికి చేరుకుని విచారణ చేశామన్నారు. సంఘటన జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి, గ్రామస్థుల సమక్షంలో ఎర్త్‌వైరును స్వయంగా పట్టుకుని పరిశీలించి చూశామన్నారు. ఆ ఎద్దు ఏదో రుగ్మతతో చనిపోయి ఉండవచ్చునని తెలిపారు.

ఐక్యత చాటుకుంటే బలిజలకు ఎదురు లేదు

● బలిజ ఐక్య వనభోజన ఆత్మీయ సమావేశంలో వక్తలు

రైల్వేకోడూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఐక్యత చాటుకుంటే బలిజలకు ఎదురు లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, రిటైర్డ్ అదనపు ఎస్పీ మునిరామయ్య తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు పట్టణంలోని రాజ్ కన్వెన్షన్‌లో బలిజ ఐక్య వనభోజన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లా డుతూ బలిజల్లో చీలికలు లేకుండా చేసుకోవాలన్నారు. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. కొన్ని కులాలు అణగదొక్కాలని చూస్తున్నా భయపడకుండా ఐక్యంగా ఉండాలన్నారు. ప్రతి ఎన్నికల్లో యువకులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బలిజ ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, రైతులు, వ్యాపారులు పేదలకు చేయూత అందించాలన్నారు. బలిజలు ఇతర రాష్ట్రాల్లో కూడా ఐక్యత చాటుకుంటున్నారని తెలిపారు. పలువురిని సన్మానించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, టీడీపీ సీనియర్ నాయకుడు బాలిశెట్టి హరిప్రసాద్, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పగడాల వరలక్ష్మి, కిరణ్‌రాయల్, జనసేన కడప జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, కార్యక్రమ నిర్వాహకులు నార్జాల దాశరథి, నల్లంశెట్టి యానాదయ్య, ముద్దపోలు సభాపతి, మహిళా నాయకురాళ్లు కారుమంచి సంయుక్త, తాతంశెట్టి తులసి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

రైల్వేకోడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా పెండ్యాల విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను నాయకులు మేడా వెంకట సుబ్బయ్య, కొప్పరపు నరసింహులు తదితరులు ఆదివారం ప్రకటించారు. ఎన్నికల బరిలో పెండ్యాల విజయ్ కుమార్, కామిశెట్టి సత్యనారాయణగుప్తా నిలిచారు. ప్రచారం కూడా ముమ్మరంగా నిర్వహించారు. మొత్తం ఓట్లు 277 ఉండగా 271 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కామిశెట్టి సత్యనారాయణగుప్తాకు 85 ఓట్లు, పెండ్యాల విజయ్‌కుమార్‌కు 191 ఓట్లు రావడంతో ఆయన 111 ఓట్లతో విజయం సాధించారు. ఈ ఎన్ని కల్లో కొందరి వ్యూహం బెడిసికొట్టింది. అనంతరం ఆర్యవైశ్యులందరూ విజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల నివారణతో పాటు, రోగాలు దూరం అవుతాయని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివ శంకర్‌రెడ్డి తెలిపారు. నేషనల్ సర్వీస్ స్కీమ్‌లో భాగంగా ఈ నెల 12వ తేదీ నుంచి ఏపీ మోడల్ స్కూల్ విద్యా ర్థులతో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చౌటపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని పరి సరాలను పరిశుభ్రంగా మార్చి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆది వారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ముగింపులో భాగంగా డగ్స్ మాదకద్రవ్యాలు, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.


గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలి

● ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిరాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న భాషా పండితుల పోస్టులను భర్తీ చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని నిర్వహించిన రాయచోటి డివిజన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్‌లో బదిలీ పొంది, ఇప్పటి వరకు రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. టెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిర్యాదు దాఖలు చేసినందుకు అభినందిస్తూ, కేంద్ర ప్రభుత్వంతో కూడా చర్చించి, ఉపాధ్యాయులకు అనుకూల మైన నిర్ణయం తీసుకురావాలని కోరారు. అనంతరం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డిరమేశ్ మాట్లాడుతూ మండల స్థాయి నుంచి నోబుల్ టీచర్ అసో సియేషన్‌ను బలోపేతం చేసేందుకు విస్తృతంగా సభ్యత్వ నమోదు చేయా లని మండల కమిటీలకు సూచించారు. అనంతరం డైట్ ఇన్‌చార్జి ప్రిన్సి పాల్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. గెజిటెడ్ పదోన్నతులకు డైట్ సీనియర్ లెక్చరర్లుగా, స్కూల్ అసిస్టెంట్లకు లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించేలా కృషి చేయాలన్నారు. అనంతరం అసోసియేషన్‌కు సంబంధించి వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఏ రాష్ట్ర కార్యదర్శి సురేశ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు జయన్న, వేణుగోపాలరావు, దుర్గేశ్వర్‌రాజు, రియాజ్, రామకృష్ణనాయక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు

మండల కార్యవర్గం ఎన్నిక

పట్టణంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు సమక్షంలో రాయచోటి మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్, గౌరవాధ్యక్షుడుగా పాలగిరి పక్కీరా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

సంబేపల్లె అధ్యక్షుడుగా రెడ్డెన్న

రాయచోటి నేతాజీ సర్కిల్: రాయచోటి జూనియర్ కాలేజీలో నిర్వహించిన ఐ కార్యక్రమంలో సంబేపల్లె మండల ఎన్టీఏ అధ్య క్షుడుగా గౌనిపల్లి రెడ్డెన్న, ప్రధాన కార్యదర్శి గా చాగలమర్రి పీరయ్య, గౌరవాధ్యక్షుడుగా అరమాటి రెడ్డెప్పరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటరామానాయుడు, ఉపాధ్యక్షుడుగా సుద్దల సుధాకర, గౌరవ సలహాదారుగా సోమలరాజు జనార్దన్‌రాజు, ఆర్థిక కార్యదర్శిగా రాజేంద్రనాయుడు, సహ కార్యదర్శులుగా శ్రీరాములు, నాగరాజు, వెంకటశివయ్య, బెల్లం మధుసూదన్‌రెడ్డి, మహిళా కార్యదర్శిగా సుమిత, సహాయ కార్యదర్శిగా అనూషను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఏ రాష్ట్ర నాయకుడు పూజారి రామయ్య, కోదూరు కులశేఖర్‌రెడ్డి, నల్లమల రామాంజులు, రెడ్డెయ్యరాజు, మద్దిరాల నాగేశ్వర, నల్లమల వెంకటే శ్వర్లు, కొండూరు చంద్రశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'రక్తదానం ప్రాణదానంతో సమానం'

సుండుపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని సుండుపల్లె మానవత చైర్మన్ మిన్నమరెడ్డి గంగిరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మానవత సంస్థ ఆధ్వ ర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఈ శిబి రంలో 20 మంది మానవతా సంస్థ సభ్యులు రక్తదానం చేశారన్నారు. రక్తదాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి హరికుమార్, సంఘ సేవకులు సయ్యద్ అహ్మద్, కన్వీనర్ కృష్ణంరాజు, నాగేశ్వరరావు, అమ్మనాయక్, ఆరీఫుల్లా, నరసింహా, లక్ష్మయ్య నాయుడు, మానవతా సభ్యులు, రక్తదాతలు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

గ్రంథాలయోద్యమ నేతలకు నివాళి

ఓబులవారిపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైకోట గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎస్.ఆర్. రంగనాథన్, అయ్యంకి వెంకట రమణ, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పరిధిలోని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కూలు ఉపాధ్యా యురాలు హరిత, మంజుల, ప్రవళిక పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఉద్యమకారుల సేవలను విద్యార్థులకు తెలియజేశారు. గ్రామ పెద్దలు వెంకటయ్య, వెంకటరమణ, గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ పాల్గొన్నారు.


గ్రంథాలయోద్యమ నేతలకు నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రామాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ ఉద్యోగి సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీ ఉపయోగాలు, వాటి ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించామన్నారు. దీంతో విద్యార్థులు గ్రంథాలయాల ఉపయోగాలు తెలుసుకుంటారన్నారు. వ్యాసరచన పోటీల పై అవగాహన లభిస్తుందన్నారు.


రామాపురం గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం


పెన్షనర్ల సంఘం కార్యవర్గ సభ్యులు

రాజంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడుగా పిల్లి పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా పి.ఎల్లయ్య, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ కేడీ వరప్రసాద్, కె. కృష్ణయ్య, ట్రెజరర్‌గా జి.చలపతి, అసోసియేట్ అధ్యక్షుడుగా బీవీ నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వరి, ఎస్.రామాంజనేయులు, వసంత నాయుడు, భాస్కర పంతులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పి.సుబ్బరామయ్య, కె.నరసింహులు, సుశీలమ్మ, కార్యదర్శులుగా రమణనాయుడు, యానాదయ్య, వసంతకుమారి, ఎం.నారాయణ, జయచంద్రారెడ్డి, ఆర్థిక కమిటీ సభ్యులుగా ఏసన్న, బాబు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా కె.చౌడమ్మ, లక్ష్మీనరసయ్య, ఎం.సుబ్రమణ్య ఎన్నికయ్యారు. రాష్ట్ర నాయకులు చిన్నరెడ్డన్న, బి.నారాయణ కార్యదర్శి రెడ్డికుమార్, జయచంద్రారెడ్డి, చెంగల్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు డీఏ విడుదల చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. పీఎఫ్, గ్రాట్యుటీ ఇతర అలవెన్సులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదం జరిగితే తప్ప స్పందించరా?

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ విక్టరీ హైస్కూల్ సమీపంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయడానికి అధికారులు ఒక గొయ్యిని తీశారు. నాలుగు రోజులు అవుతున్నా స్తంభం ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గొయ్యి తవ్విన ప్రాంతానికి సమీపంలో ఒక ట్యూషన్ సెంటర్ ఉన్నందున రాత్రి వేళల్లో విద్యార్థులు తరచుగా ఆ మార్గంలో వెళుతుంటారు. ప్రమాదవశాత్తు ఎవరైనా ఈ గొయ్యిలో పడితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. విద్యుత్ కాంట్రాక్టరుతో పాటు అధికారులు కూడా చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి స్తంభం ఏర్పాటు చేసి గొయ్యిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.


విద్యుత్ స్తంభం కోసం తవ్విన గొయ్యి

20 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆది వారం 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో అర్హులైన 20 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయిం చుకున్న 25 మందికి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, లయన్ నాగేశ్వర రావు, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, సిద్దారెడి పాల్గొన్నారు.


ఆపరేషన్లకు అర్హులను ఎంపిక చేస్తున్న వైద్యులు



భక్తిశ్రద్ధలతో పడిపూజ

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం అయ్యప్ప స్వామి పడి పూజ నిర్వహించారు. శబరిమలైలో స్వామివారి దర్శనం ప్రారంభం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అర్చకుడు బి.సుదర్శన్ శర్మ తెలిపారు. పూజ అనంతరం భక్తులకు అల్పా హారం అందజేశారు. దేవస్థానం కమిటీ చైర్మన్ కె.నరసింహులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.వెంకట సుబ్బయ్య, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కె.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


పడిపూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

వర్గీకరణతో మాలలకు నష్టమే: మాజీ మంత్రి చింతా మోహన్

మదనపల్లె అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాలలకు నష్టమేనని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక జేసీఎం కమ్యూనిటీ మందిరంలో ఏర్పాటు చేసిన మాలమహానాడు రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో కిడ్నీ రాకెట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కార్పొరేషన్లు మూసేశారని, వెంటనే ప్రారంభించాలని కోరారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమాల సుదర్శనం మాట్లాడుతూ భారతదేశంలో మాలలపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాలల్లో రాజకీయ చైతన్యం, సమాజంలో గుర్తింపు వచ్చేలా ఐక్యతతో రాజ్యాధికారం సాధించాలన్నారు. మాలలను ఐక్యం చేయడానికి మాలమహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభలు మదనపల్లెలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అశోక్‌బాబు, రెడ్డెప్ప, దాసరి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ మైనార్టీ నేత బాబాసాహెబ్ మృతి

రైల్వేకోడూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ మైనార్టీ నేత సయ్యద్ బాబాసాహెబ్ ఆదివారం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఆవిర్భావం నుంచి టీడీపీలోనే ఉన్నారు. మైనార్టీల్లో ఆయనకు మంచి స్థానం ఉంది. మైనార్టీల కోసం అనేక సేవలు అందించారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు తదితరులు సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.


బాబాసాహెబ్ మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఆ మలుపులు.. మృత్యు పిలుపులు

నిండు నూరేళ్లు జీవించాల్సినవారు ఆ మలుపుల వల్ల వారి జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. సురక్షితంగా తమ గమ్యానికి చేరుకుంటున్నాము అనుకొనేలోపే ఆ మలుపులు.. మృత్యు పిలుపులుగా మారుతున్నాయి. అంతవరకు సంతోషంగా ఉన్న ఆ కుటుంబాలు మలుపుల రూపంలో విషాదాన్ని నింపుతున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. గత రెండు సంవత్సరాల కాలంలో ఆ మలుపులు వద్ద 20 నుంచి 25 ప్రమాదాలు జరగగా 10 నుంచి 15 మంది మరణించారు. అనేక మంది కాళ్లు, చేతులు పోగొట్టుకొని అవిటి వారైన సంఘటనలు ఉన్నాయి.





● గాలిలో కలిసిపోతున్న ప్రజల ప్రాణాలు ● పట్టించుకోని అధికారులు

గాలివీడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని రోడ్ల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారి యమపాశాలుగా తయారయ్యాయి. ముఖ్యంగా గాలివీడు-కదిరి రోడ్డు మార్గంలోని వెలిగల్లు కాలనీ వద్ద, గుర్రాలమిట్ట వద్ద ఏడాదికి సరాసరి 5 నుంచి 10 ప్రమాదాలు జరుగుతున్నాయి. గాలివీడు-రాయచోటి మార్గంలోని ఎగువగొట్టివీడు పంప్‌హౌస్ సమీపంలో ఉన్న మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కరిమిరెడ్డిగారిపల్లె క్రాస్ రోడ్డులోని గంగమ్మ గుడి, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ఉన్న మలుపుల్లో ఏడాది క్రితం జరిగిన ఆటో ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోగా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. రెండు రోజుల క్రితం ఒడిసెలవంకపల్లె వద్ద జరిగిన ప్రమాదంలో వరుణ్‌కుమార్ మరణించాడు. ఆగస్టు, సెప్టెంబరు నెలలోనే వివిధ మలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మరణించగా 8మందికి తీవ్రగాయాలయ్యాయి. అరవీడు రోడ్డు మార్గంలో ఎల్లంపల్లె, ఆంజనేయస్వామి, ఇతర మలుపుల వద్ద, గాలివీడు-కోనంపేట రోడ్డు మార్గంలోని పేరంపల్లి మిట్ట, గొందిపల్లె క్రాస్ వద్ద ఏడాదికి 10 నుంచి 15 ప్రమాదాలు జరుగుతున్నాయి. నూలివీడు పంచాయతీ బొందలవంక 'ఎస్' ఆకారంలో ఉండడం వల్ల, అలాగే మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడం, ఇంకొన్ని మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడకుండా వృక్షాలు అడ్డంగా ఉండటం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మలుపులు లేని రోడ్లు ఏర్పాటు చేయాలి..

మండలంలోని కొన్ని రోడ్డు మలుపులు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. రోడ్డుపై అవగాహన లేనివారు, కొత్తవారు ఈ మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. గుర్రాలమిట్ట, గోరాన్‌చెరువు పంచాయతీల్లోని మలుపుల వద్ద, బొందలవంక, గొందిపల్లె మలుపుల వద్ద తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువ మలుపులు లేని రోడ్డును ఏర్పాటు చేయాలి.

\- నరసారెడ్డి, గాలివీడు



సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

మండలం గుండా వివిధ జిల్లాలను కలుపుతూ ఉన్న ప్రతి రహదారిలోనూ మలుపులు ఉన్నాయి. అయితే చాలా మలుపుల వద్ద సూచిక బోర్డులు లేవు. దీంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మరికొన్ని మలుపుల వద్ద పెద్ద చెట్లు అడ్డంగా ఉన్నాయి. అధికారులు స్పందించి చెట్లను తొలగించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

\- దేవేంద్ర, నాగూరివాండ్లపల్లె

క్వార్టర్ ఫైనల్ చేరుకున్న బేస్‌బాల్ జట్లు

రైల్వేకోడూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బుడుగుంటపల్లె పరిధిలో ఉన్న జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీలలో ఆదివారం పలు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర పోటీలలో నెల్లూరు-ఈస్ట్ గోదావరి పైన 0-9, అనంతపురం-కడప పైన 5-3, శ్రీకాకుళం-కర్నూలు జట్టు పైన 6-1, విశాఖపట్నం-కృష్ణా పైన 6-2, చిత్తూరు-ప్రకాశం జట్టుపై 5-2, అనంతపురం-ఈస్ట్ గోదావరి జట్టుపై 4-3, కడప-నెల్లూరు జట్టుపై 5-1, విజయనగరం-శ్రీకాకుళం జట్టుపై 2-1, వెస్ట్ గోదావరి-కృష్ణ జట్టుపై 8-0, గుంటూరు-చిత్తూరు జట్టుపై 6-4, నెల్లూరు-అనంతపురం జట్టుపై 7-6, కడప-ఈస్ట్ గోదావరి జట్టు పై 12-1, కర్నూలు-విజయనగరం జట్టు పై 12-1, విశాఖపట్నం-వెస్ట్ గోదావరి జట్టు పై 10-0 స్కోర్‌తో లీగ్ దశలో విజయం సాధించినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగం ఆర్గనైజింగ్ కార్య దర్శి చంద్రమోహన్ రాజు తెలిపారు. బాలికల విభాగంలో ఈస్ట్ గోదావరి- అనంతపురం జట్టుపై 12-0, చిత్తూరు-ప్రకాశం జట్టుపై 10-5, నెల్లూరు- విశాఖపట్నం జట్టుపై 10-0, కర్నూలు-అనంతపురం జట్టుపై 11-1, కడప-ఈస్ట్ గోదావరి జట్టుపై 14-8, విజయనగరం-కృష్ణా జట్టుపై 15-12, శ్రీకాకుళం- చిత్తూరు జట్టుపై 12-1, గుంటూరు-నెల్లూరు జట్టుపై 7-3, కడప-అనంతపురం జట్టుపై 13-3, కర్నూలు-ఈస్ట్‌గోదావరి జట్టుపై 11-2, శ్రీకాకుళం-ప్రకాశం జట్టుపై 8-1 స్కోర్‌తో విజయం సాధించినట్లు తెలిపారు. పూల్-ఏలో గుంటూరు, నెల్లూరు, పూల్-బీలో శ్రీకాకుళం, చిత్తూరు జట్లు, పూల్-సీలో విజయనగరం, కృష్ణా, పూల్-డీలో కర్నూలు, కడప జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయన్నారు. అలాగే బాలురు విభాగంలో పూల్-ఏలో గుంటూరు, చిత్తూరు, పూల్-బీలో విశాఖపట్నం, వెస్ట్‌గోదావరి, పూల్-సీలో కర్నూలు, శ్రీకాకుళం, పూల్-డీలో కడప, నెల్లూరు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయని తెలిపారు. సోమవారం క్వార్టర్ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలను నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్‌లో జిల్లా క్రీడాకారులకు 17 పతకాలు



సత్తా చాటిన జిల్లా వెయిట్ లిఫ్టర్లు

కడప స్పోర్ట్స్ నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కొండవెలగడ గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల, బాలికలు, మహిళలు, పురుషుల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లాకు చెందిన వెయిట్‌లిఫ్టర్లు 17పతకాలు సాధించినట్లు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ నారాయ ణరావు వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 5 బంగారు, మరో 5 వెండి, 7 బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన షేక్ షావల్లి

రాజంపేట టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం ఉస్మాన్‌నగర్‌కు చెందిన షేక్ షావల్లి(28) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గొడవ పడి భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడు షేక్ షావల్లి డ్రైవర్‌గా పనిచేసేవాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు.

సహకార సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దతిప్పసముద్ర నవంబజుజీ 16 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ కె.రాజశేఖర్‌రెడ్డి రైతులను, ఖాతాదారులను కోరారు. 72వ అఖిల భారత సహకార మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సహకార సంఘం కార్యాలయంలో సహకార జెండాను బ్యాంకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార రంగాన్ని సహకార సంఘాలను బలోపేతం చేసుకోవాలని సంఘ సభ్యులను కోరారు. సహకార సంఘం ద్వారా రైతులకు ఎరువులు, క్రిమిసంహారక మందులు, పంట రుణాలను విరివిగా అందించడం జరుగుతుందన్నారు. అలాగే స్వల్పకాలిక రుణాలు, బంగారు నగలపై రుణాలను అందించడం జరుగుతుందన్నారు. ఖాతాదారులు, సంఘసభ్యులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సిఈవో చంద్రశేఖర్, పీటీఎం మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్, మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్ బాబు, బీజేపి సీనియర్ నాయకులు సిమెంట్ శీనా, శివ, కుమ్మరవారిపల్లె రాజేష్, టీడీపీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కత్తిఆదినారాయణ(అప్పల్ల), జనసేన సూరి, ఎఆర్పీయస్ రామప్ప (పెద్దోడు), కుమ్మర శివరాం, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపస్ సంఘం ఏకగ్రీవ ఎంపిక

పీలేరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(అపస్) కేవీపల్లె మండల నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పచ్చార్ల సుధాకర్ తెలిపారు. ఆదివారం పీలేరు పీపుల్ పాఠశాలలో కేవీపల్లె మండల అపస్ సంఘ సమావేశంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా హరినాయక్‌ను ఎన్నుకున్నారు. మరో పది మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా అపస్ అధ్యక్షుడు నరసింహులు వ్యవహరించారు. కొత్తగా ఎంపికైన అధ్యక్షుడు సుబ్రమణ్యం మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, జయపాల్ రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ఓబుల్ రెడ్డి, శివశంకర్, చంద్రకళ, శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినీత్ మృతిపై హత్య కేసు నమోదు

కలికిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వివాదాస్పదమైన స్థానిక యువకుడు వినీత్‌కుమార్‌రాజు అనుమానాస్పద మృతిపై హత్య కేసుగా నమోదు చేశారు. వ్యక్తిగత కక్షల కారణంగా వినీత్‌ను నలుగురు స్నేహితులు కలిసి హింసించి హత్య చేశారని, దాన్ని యాక్సిడెంట్ కేసుగా పరిగణించడాన్ని నిరసిస్తూ మృతుడి తల్లిదండ్రులు, బంధువులూ రెండు రోజులుగా జరిపిన పోరాటం ఫలితంగా ఎట్టకేలకు హత్యగా నమోదు చేశారు. తల్లిదండ్రులు రామకృష్ణరాజు, సుకన్య చెపుతున్న విధంగానే అబూ మొబైల్స్ యజమాని అబూబెకర్, బబ్లు, నరేష్, అహ్మద్‌లను నిందితులుగా చేర్చారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఇథియోస్ కారు నడుపుతున్న బబ్లు సత్యాపురం వద్ద రోడ్డుపై వున్న వినీత్‌ను కారుతో ఢీకొట్టి పారిపోయాడు. మూడు గంటల ప్రాంతంలో కలికిరి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేవలం కారు ప్రమాదం కారణంగానే వినీత్ చనిపోయాడని ఆ విధంగానే ఫిర్యాదు ఇవ్వాలని పోలీసులు వినీత్ తల్లిదండ్రులకు సూచించారు. కానీ తమ కుమారుడిని నలుగురు స్నేహితులు కలిసి చంపేసి సత్యాపురం వద్ద పడేసి వెళ్లారని, చుట్టుపక్కల వారు గమనించడంతో కారు ప్రమాదంగా సృష్టించారని వినీత్ తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. ఆ విధంగానే ఫిర్యాదు చేస్తామని పట్టుబట్టారు. ఈ వివాదంతో శనివారం రాత్రి వరకూ ఫిర్యాదు ఇవ్వని కారణంగా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో మృతదేహానికి శవపరీక్ష కూడా జరగలేదు. వినీత్ తరపున పెద్ద సంఖ్యలో పోలీసుస్టేషన్ వద్ద ధర్నాకు దిగడంతో ఎట్టకేలకు శనివారం రాత్రి అనుమానాస్పద మృతిగా మాత్రం కేసు నమోదు చేస్తామని సీఐ అనిల్‌కుమార్ మీడియాకు చెప్పారు. దీంతో కేసు నమోదయి ఆదివారం శవపరీక్ష పూర్తయ్యింది. మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్న అనంతరం హత్య కేసుగా నమోదు చేసే వరకూ శవాన్ని పోలీసుస్టేషను వద్దే వుంచడానికి వినీత్ తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. విషయం జటిలం కావడంతో రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, పీలేరు సీఐ యుగంధర్ పలు దఫాలు బాధితులతో చర్చలు జరిపారు. ఎట్టకేలకు హత్య కేసుగా నమోదు చేయడంతో వినీత్ అంత్యక్రియలు పూర్తి చేస్తారు. కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తామని, నిందితులకు శిక్ష పడే విధంగా సెక్షన్లను చేరుస్తామని డీఎస్పీ కృష్ణమోహన్ హామీ ఇచ్చారు. అనంతరం సంఘటన పూర్వా పరాలపై సుదీర్ఘంగా విచారణ జరిపారు. నిందితుల సెల్‌ఫోన్లలోని వివరాలను ట్రాక్ చేస్తున్నారు. శవపరీక్ష నివేదికలో వెల్లడయ్యే అంశాల మేరకు అన్ని విషయాల్లో ఆధారాలకు సంబంధించి స్పష్టత వస్తుందని పోలీసులు చెపుతున్నారు.

న్యాయం చేయాలని యువతి ఆందోళన


పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న యువతి

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కోడూరు మండలంలోని శెట్టిగుంట గ్రామానికి చెందిన షేక్ యాస్మిన్ అనే యువతి ఆదివారం పోలీస్‌స్టేషన్ వద్ద పెట్రోల్ పోసుకుని ఆందోళన చేపట్టింది. తన భర్త షేక్ అప్సర్ తనకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్నాడని, ఈ విషయమై తాను రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఆమె వెల్లడించింది. శుక్రవారం ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇప్పటివరకు స్పందించలేదని, దీంతో తనకు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. ఈ సంఘటనపై సీఐ హేమసుందర్‌రావును వివరణ కోరగా యువతి ఇప్పటివరకు తన భర్త రెండో వివాహం చేసుకున్నట్లు ఆధారాలు సమర్పించలేదని, యువతి ఇచ్చిన ఫిర్యాదుపై కోర్టు అనుమతి తీసుకుని కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

బాలుడు అదృశ్యం



కడప క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కడప నగరం బముజన్ నగర్‌కు చెందిన బాలుడు అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. బహుజన్‌నగర్‌కు చెందిన అల్లం నందుకుమార్ 8వతరగతి చదువుతున్నాడు. గత నెల 23న స్కూలుకు వెళ్లాక ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీని నమ్మి మోసపోయాం

● వెంకటరెడ్డిని శిక్షించండి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీని నమ్మి మోసపోయమని, నిందితుడు వెంకటరెడ్డిని కఠినంగా శిక్షించాలని మదనపల్లెకు చెందిన లక్ష్మీతాయారమ్మ, కర్నూలుకు చెంది కౌశిక్ కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ అమెరికా కొలంబస్ సెంట్రల్ యూనివర్సిటీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ జాయిన్ చేయిస్తామని హైదరాబాద్‌కు చెందిన ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీ నిర్వాహకులు మారెడ్డి వెంకటరెడ్డి, చైతన్య విద్యార్థుల వద్ద డబ్బు వసూలు చేశారని తెలిపారు. ఆ కళాశాలలో చదవకపోయినా సర్టిఫికెట్లు ఇస్తారని నమ్మించారన్నారు. తీరా బ్యాంకు రుణం కోసం వెళ్లగా ఆ కళాశాలకు ఎలాంటి గుర్తింపు లేదని తేలిందన్నారు. దీనిపై కన్సల్టెన్సీ నిర్వాహకులను సంప్రదిస్తే 'డబ్బు తిరిగి ఇచ్చేది లేదు.. ఏం చేస్తారో చేసుకోండి' అంటూ బెదిరించారన్నారు. తెలంగాణ సీఎం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాధితులు

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు


వడ్డిపల్లె రాజు (ఫైల్)

తంబళ్లపల్లె, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు అని వెళ్లిన తన కుమారుడు వడ్డిపల్లె రాజు(15) అదృశ్యమయ్యాడని తంబళ్లపల్లె మండలం చింతలరేవుపల్లెకు చెందిన దామోదరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తంబళ్లపల్లె మండలం దిగువపాళెం పంచాయతీ చింతలరేవుపల్లెకు చెందిన దామోదరం కుమారుడు వడ్డిపల్లె రాజు ములకలచెరువు మండలం వేపూరికోట ఎస్వీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే రాజు శనివారం పాఠశాలకు స్వగ్రామం నుంచి బస్సులో వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పాఠశాలలో వాకబు చేయగా రాజు పాఠశాలకు రాలేదని తెలిపారు. దీంతో తల్లితండ్రులు బంధువులు, తెలిసిన వాళ్ల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం బాలుడి తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వాల్మీకిపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గంగాదొడ్డి వాసి శ్రీరాములు(58) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై వెళ్తూ ఆటో ఢీకొనడంతో గాయపడిన శ్రీరాములును చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిస్సార్ నగుబాటు కావద్దు : టీడీపీ


మాట్లాడుతున్న చైర్మన్ శివరామ్, వైస్‌చైర్మన్ ఆంజనేయులు

మదనపల్లె టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇంజనీర్‌గా పని చేసిన నీవు తెలివిలేని మాటలు మాట్లాడుతూ ప్రజల్లో నగుబాటు కావద్దని మదనపల్లె వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ హితవు పలికారు. ఆదివారం స్థానిక మార్కెట్‌యార్డు మీటింగ్ హాల్లో డైరెక్టర్లతో కలసి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యే ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారన్నారు. పెద్దసంఖ్యలో రైతులు, కూటమి నేతలు పాల్గొన్న సమావేశం చూసి మతిపోయిన నిస్సార్‌కు సభకు జనమే రాలేదనడం చూస్తే ఆయనకు తెలివి వుందా అని ప్రశ్నించారు. జిల్లాల విభజనకు ఏర్పడ్డ మంత్రివర్గ ఉపసంఘంలోని నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ మదనపల్లె జిల్లాను ప్రకటించలేదని నిస్సార్ విమర్శించడం చూస్తే ఆయనకు పాలన పరిజ్ఞానం కూడా లేదని తెలుస్తోందన్నారు. మదనపల్లె జిల్లా కాకుండా అడ్డుపడిన ఎంపీ మిధున్‌రెడ్డిని అప్పట్లో నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఎందుకు ప్రశ్నించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు మాట్లాడే ముందు ఆలోచించి పెదవి విప్పాలని హితవు పలికారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో రైతులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మున్నానాయక్, శ్యామలమ్మ, బాబు, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా కార్తీక వనభోజనం

ఐక్యతకు మరో రూపం ● ప్రత్యేకత సంతరించుకున్న ధాత్రీపూజ

ఆటపాటలతో సాగిన బ్రాహ్మణ, ఆర్య వైశ్య, పద్మశాలి, బలిజ సంఘం వనమహోత్సవం

శివకేశవులకు ప్రీతికరమైనది కార్తీక మాసం. 'న కార్తీక సమో మాసః న దేవం కేశవాత్పరం! నచవేదం సమం శాస్త్రం !! న తీర్థం గంగాయ స్తమమ్', అని స్కంద పురాణంలో చెప్పినట్లు కార్తీక మాసానికి సమానమైన మాసం, కేశవుడికి సమానమైన దేవుడు, వేదంతో సమానమైన శాస్త్రం, గంగతో సమానమైన తీర్థం లేదని అర్థం. ఈ మాసంలో చేసే దీక్షలు, ఉపవాసాలు, వ్రతాలకు ఎంతో పవిత్రత చేకూరుతుందని విశ్వాసం. ఈ మాసంలో ఐక్యతకు మారుపేరుగా కులస్థులతో కలిసి వన మహోత్సం నిర్వహిస్తుంటారు. ఫలితంగా కుటుంబీకులతో ఒక రోజైనా కలిసి ఉన్నట్లు ఉంటుందని, సమాజంలో ఉన్న కుల బంధువుల పరిచయాలు పెరుగుతాయని కార్తీక మాసంలో వనభోజనాలు పేరుతో ఒక్కచోట చేరి ఆటపాటలతో ఉత్సాహంగా గడుపుతారు. పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల్లోని బ్రాహ్మణ, ఆర్యవైశ్య, పద్మశాలి, బలిజ సంఘాల వారు సంఘటితమై వనభోజనం చేసుకున్నారు. వివరాల్లోకెళితే...

మదనపల్లెలో శంకర బ్రాహ్మణ సేవా సమితి...



నాట్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

మదనపల్లె అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శంకర బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు కోదండరామయ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ వనభోజన మహోత్సవాన్ని నిమ్మనపల్లె రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించారు. అంభయాంజనేయస్వామికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, అర్చనలు, శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. చిన్నారుల నాట్య ప్రదర్శన అలరించింది. శంకరబ్రా హ్మణ సేవా సమితి అధ్యక్షుడు కోదండరామయ్య, నరసింహులు, నాగ భూషణరావ్, ప్రకాష్, కేశవాచార్యులు, యూటీఏ మధు, అడ్వకేట్స్ సరస విద్యాసాగర్, జ్యోతి, విజయేంద్ర, మహిళలు పద్మావతి, చంద్రకళ, పద్మారాణి, డాన్స్‌మాస్టర్ సిల్మా, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం



భ్రమరాంబ, మల్లికార్జున స్వామి ఉత్సవ మూర్తులతో...

పీలేరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు కార్తీక వన మహోత్సవం నిర్వహించారు. దొడ్డిపల్లె పంచాయతీ శివరామాపురంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్ర హోమం, పూర్ణాహుతి, మంగళ హారతి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణీంద్ర శర్మ ఇంటి నుంచి శివపార్వతుల ఉత్సవ మూర్తులను మేళతాళాలు, వేదమంత్రోచ్చారణ నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేర్చి స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం మహిళలు గార్గేయ నదిలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్ర శర్మ, నరసింహమూర్తి, జీవీఎస్ఆర్‌కేవీ ప్రసాద్, శ్రీధర్ స్వామి, గంజికుంట సంతోశ్ అయ్యర్, ఎల్ఐసీ కుమార్, సుధాకర, విరూపాక్షం కాశీనాథ్, సూత్రం కిరణ్ కుమార్, ప్రభాకర్ రావు, కృష్ణప్రసాద్, వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.



కాణిపాక కమిటీ సభ్యురాలు వాణిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం

ఆర్యవైశ్య వన భోజన మహోత్సవం

మదనపల్లె అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సం ఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యు ల ధాత్రీ వన విహార వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఆదివారం ఆర్యవైశ్య గార్డెన్స్‌లో కన్యకా పరమేశ్వరిదేవికి ధాత్రీ పూజ నిర్వహించారు. అనంతరం అందరూ ఉల్లాసంగా సాయంత్రం వరకు అక్కడే గడిపారు. కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయం ట్రస్టు సభ్యురాలు వాణిని మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, ఉపాధ్యక్షుడు దేవతాసతీశ్, కార్యదర్శి సూరేగిరిధర్, సత్యప్రసాద్, ఆర్యవైశ్య మహిళలు సన్మానించారు. మహిళలు, యువత ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అందరూ కలిసి వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పద్మశాలి కార్తీక వనభోజనం

స్థానిక అనపగుట్ట సమీపంలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో పద్మశాలి సంఘం సభ్యులు కార్తీక వనభోజన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మృత్యుంజయేశ్వర ఆలయంలో శివుడికి ప్రత్యేకం పూజలు, హోమాలు నిర్వహించారు. పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పద్మశాలీయులు ఐక్యమత్యంతో అభివృద్ధి చెందాలని ఆ



భోజనం వడ్డిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

సంఘం నేతలు అన్నారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రాజ్యాధికార సాధనకు బలిజలు కృషి చేయాలి

పీలేరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గత చరిత్రను తెలుసుకుని, తమ రాజుల జీవిత చరిత్ర స్ఫూర్తితో రాజ్యాధికార సాధనకు సమష్టిగా కృషి చేయాలని బలిజ సంఘ నేతలు పిలుపునిచ్చారు. బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలో కార్తీక వనభోజనం సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ క్రీస్తుశకం మూడో శతాబ్దం నుంచి ఆంధ్ర రాష్ట్రాన్ని చోళ రాజుల దగ్గర నుంచి విజయనగర, మధురై, తంజావూరు నాయక రాజుల వరకు బలిజ రాజులు పాలించారని గుర్తు చేశారు. అనైక్యత, రాజకీయాల పట్ల అనాసక్తి కారణంగా తదనంతర కాలంలో బలిజలు రాజకీయాలకు, తద్వారా పదవులకు దూరమయ్యారన్నారు. అయితే గత తప్పిదాలను సరిచేసుకోవడమే కాక భావి తరాలకు మంచి భవిష్యత్తును కల్పించేందుకు అందరూ సంఘటితంగా ఉంటూ మరోమారు రాజ్యాధికార సాధనకు కృషి చేయాలన్నారు. ఎవరికి ఏ అవకాశం వచ్చినా అందరూ సహకరించాలని తీర్మానించారు. అంతకుమునుపు శివకేశవులు, ఉసిరి చెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బలిజ సంఘం నేతలు ప్రభాకర, డాక్టర్ మల్లికార్జున, జీవీ రవికుమార్, పీవీ రమణ, డిష్ పురుషోత్తం, పోతంశెట్టి రమేశ్, రామచంద్ర, లక్ష్మీకర, వెంకటరమణ, మనోహర, జగన్మోహన్, సుబ్బయ్య, మధు, వినయ్, నాగరాజ, నాగేంద్ర ప్రసాద్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.



శివకేశవులకు పూజలు చేస్తున్న బలిజ సంఘ నేతలు, మహిళలు

డివిజన్ సర్వేయర్ల అధ్యక్షుడిగా సురేష్



కమిటీ చేత ప్రమాణం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యం

మదనపల్లె, నవంబరు 16(ఆంధ్ర జ్యోతి): మదనపల్లె డివిజన్ సర్వేయర్ల సంఘం డివిజన్ అధ్యక్షుడిగా సర్వేయర్ వై.సురేష్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో ఆదివారం డివిజన్ సర్వేయర్ల సమావేశంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మదనపల్లె డీఐ రవిచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మదనపల్లె మండలం కురవంక సచివాలయ సర్వేయర్ సురేష్‌కుమార్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా ఎ.ముబారక్, కార్యదర్శిగా కె.రవిచంద్ర, సంయుక్త కార్యదర్శిగా బి.ఉమామహేశ్వర్‌నాయక్, ట్రెజరర్‌గా వై.శేషుకుమార్‌ను ఎన్నుకున్నారు. సభ్యులుగా మదనపల్లె మండల సర్వేయర్ బి.వి.సుబ్రహ్మణ్యం, ఎస్.హసీన్‌తాజ్, ఎస్.మహమ్మద్‌రఫీ, పి.నాగరాజ, పి.రెడ్డెప్ప, డి.పూర్ణచంద్‌ను ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నుకున్న కమిటీ చేత మున్సిపల్ ఇన్‌చార్జ్ సర్వేయర్, సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు పి.రెడ్డెప్ప, మండల సర్వేయర్ బి.వి.సుబ్రహ్మణ్యం ప్రమాణం చేయించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి, సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని చెప్పారు. ఇందుకు సహకరించిన గ్రామ, మండల, డివిజన్ల సర్వేయర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

వర్గీకరణ మాలలకు నష్టమే

విలేకర్లతో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

మదనపల్లె అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ మాలలకు నష్టమేనని ఐక్యంగా పోరాడాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక జేసీఎం కమ్యూనిటీ మందిరంలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో కిడ్నీ రాకెట్ కూటమి ప్రభుత్వానికి సంబంధించిన ఆస్పత్రిలో జరిగిందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కార్పొరేషన్లు మూసేశారని, వెంటనే ప్రారంభించాలని కోరారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమాల సుదర్శనం మాట్లాడుతూ భారతదేశంలో మాలలు ఉనికిని కోల్పోయేలా వారిపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాలల్లో రాజకీయ చైతన్యం, సమాజంలో గుర్తింపు వచ్చేలా ఐక్యతతో రాజ్యాధికారం సాధించాలన్నారు. మాలలను ఐక్యం చేయడానికి మాలమహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభలు మదనపల్లెలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాలల ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, రాష్ట్ర మాలల రాజ్యాధికార సాధన సమితి అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణ వెంకయ్య, జేఏసీ ప్రధాన కార్యదర్శి పూతలపట్టు ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గడ్డం నాగమణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలం సంజీవి, రాష్ట్ర కార్యదర్శి ఏఆర్ అశోక్, రాయలసీమ కార్యదర్శి యమాల చంద్రయ్య, గ్యాస్ భాస్కర్, ఈశ్వరయ్య, గుండా మనోహర్, కురబలకోట మండలాధ్యక్షుడు కామూరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో చైర్మన్ రాజన్ననాయుడు, ఈఓ మంజుల సిబ్బంది పాల్గొన్నారు.

మాలమహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సుధాకర్

వాల్మీకిపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాలమహానాడు ప్రచార కార్యదర్శిగా వాల్మీకిపురం వాసి శివారుపల్లె సుధాకర్ నియమితులయ్యారు. ఆదివారం మదనపల్లెలో జరిగిన రాష్ట్ర మహా సభల అనంతరం రాష్ట్ర కార్యవర్గంలో వాల్మీకిపురం మండల వాసులకు పలువురికి చోటు దక్కింది. రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా చింతపర్తి శివయ్య, చింతపర్తి శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ యమలా సుదర్శనం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించి అభినందించారు. అనంతరం శివారుపల్లె సుధాకర్ మాట్లాడుతూ మాలల అందరినీ ఐక్యతతో అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, సంఘ నేతలు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో విహారానికి నూతన బోటు



బి.కొత్తకోట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్ మానససరోవరం కొలనులో పర్యాటకులు సరదాగా విహరించడం కోసం కొత్త బోటింగ్ ఏర్పాటు చేశారు. నామమాత్ర రుసుముతో బోటింగ్ చేసే వెసులుబాటు వుండ డంతో యువకులు, నూతనజంటలు, చిన్నారులు విహరిస్తూ సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ ఎంజాయ్ చేస్తుంటారు. తాజాగా రూ.1.30 లక్షలతో మరో నూతన బోటును అధికారులు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు.

వైభవంగా ఓదేటి యల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న నిర్వాహకులు, అర్చకులు (అంతర్ చిత్రంలో) ప్రత్యేక అలంకరణలో ఓదేటి యల్లమ్మ అమ్మవారు

పీలేరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకి, త్రిశక్తి స్వరూపిణీ అయిన ఓదేటి యల్లమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. ముడుపులవేముల పంచాయతీ యల్లంపల్లె గ్రామ దేవత ఓదేటి యల్లమ్మ ఆలయానికి దాదాపు 200 ఏళ్ల చరిత్ర ఉన్నది. కాలగమనంలో ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో టీడీపీ నేత, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త హేమచంద్రారెడ్డి నేతృత్వంలో ఆరు నెలల కిందట నూతన ఆలయ నిర్మాణం, అమ్మవారి నూతన విగ్రహ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో శని, ఆదివారాల్లో అమ్మ వారి నూతన విగ్రహం, శివలింగ ఏర్పాటు చేశారు. పీలేరులో కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు విరూపాక్షం కుమారస్వామి నేతృత్వంలో వేదపండితులు శనివారం రాత్రి అమ్మవారు, శివలింగానికి గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, నవగ్రహ పూజ, జలాధివాసం, క్షీరాధివాసం, పుష్పాభిషేకం, వాస్తు హోమం నిర్వహించారు. ఆదివారం సూర్యోదయాత్పూర్వమే అమ్మవారు, శివలింగాలను ప్రతిష్ఠించి కుంభాభిషేకం, అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. శనివారం రాత్రి అమ్మవారు, శివలింగాలను పరిసర ప్రాంత గ్రామాల్లో ఊరేగించారు. భక్తులతో ఆలయం వద్ద సందడి నెలకొంది. గ్రామదేవత నూతన విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొనడానికి ఎక్కెడెక్కడో స్థిరపడిన యల్లంపల్లె, ముడుపులవేముల వాసులు, బంధుమిత్రులు తరలి రావడంతో ఆ గ్రామాల్లో సందడి నెలకొంది. గ్రామస్థులు, భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారికి దర్శించుకున్న వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తుమ్మల మల్లికార్జున రెడ్డి, చీనేపల్లె రామిరెడ్డి, వేణుగోపాల్, ఆది, తదితరులు పాల్గొన్నారు.

సర్వైకల్ క్యాన్సర్ శిబిరానికి విశేష స్పందన



మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పీలేరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు సర్వైకల్(గర్భాశయ) క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అరవిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సాయం, తిరుపతి మెడిగో హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో 126 మంది మహిళలు పాల్గొన్నారు. నిర్వాహకులు ఉచిత వైద్య పరీక్షలనంతరం 50 మందికి ఉచిత పాప్ స్మియర్ పరీక్షలు చేశారు. కాకతీయ పాఠశాలలో ట్రస్టు సభ్యులు శ్రీనివాస రెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి, వైద్యులు జిలాని, షబ్బీర్, బాషా, వెంకట్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం

ములకలచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని రాష్ట్రీయ చాలక్ ఏక్తా మంచ్ కార్మిక యూనియన్ చైర్మన్ షేక్ హబీబ్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం వెహికల్స్ డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆదుకునేందుకు చట్టం తీసుకురావాలన్నారు. సమావేశంలో హ్యూమన్‌రైట్స్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, బాస్ మండల అధ్యక్షుడు నరసింహులు, డ్రైవర్ల సంఘం నేతలు రమణారెడ్డి, నాగరాజు, బయన్న, డేగాని హరి, అక్బర్, రామానాయునికోట శంకర, రమేష్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, నిసార్ పాల్గొన్నారు.

'పీఆర్‌సీ కమిటీ ఇంకెప్పుడు'

పీలేరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ కమిటీ నియామకంలో జాప్యం చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహులు, రమణారెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరులతో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదన్నరవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్‌సీ కమిటీ ప్రకటనలో కాలయాపన చేయడమేమిటని ప్రశ్నించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆవిర్భవించిన అపస్ సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి శివశంకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర వ్రత కల్ప పూజ

పీలేరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో కోటపల్లెలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా శ్రీవెంకటేశ్వర వ్రత కల్ప పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు, వీ.వీ. గోపీకృష్ణ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వంద జంటలు పూజలో పాల్గొన్నారు. భక్తులకు శ్రీవారి భక్త బృందం ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

కొద్దేవర బొట్టుతో ఐక్యత, అనురాగం



కొద్దేవర బొట్టును స్వీకరిస్తున్న మహిళలు

తంబళ్లపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పూర్వీకుల నుంచి నియోజకవర్గంలోని మెరుసుకాపు రెడ్ల(గాలిగుట్ట దాయాదులు) మహిళలు నియమనిష్ఠలతో నిర్వహించుకునే కొద్దేవర బొట్టు ఐక్యతకు, అనురాగానికి ప్రతీకగా నిలుస్తుంది. దిగువ గాలిగుట్టపల్లెలో ఆదివారం గాలిగుట్ట దాయాది మహిళలు కొద్దేవర బొట్టు చేసుకున్నారు. దేవర పెద్ద జయరాం రెడ్డి, పద్మావతి దంపతులు కుల దైవం మద్దమ్మ దేవత అమ్మవారికి ధూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. అనంతరం కొర్రలు, పచ్చి వరి ఎన్ను, బెల్లం, పసుపు మిశ్రమం నూరి కొద్దేవర బొట్టు తయారు చేసి పచ్చని ఆకుల్లో మహిళలకు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున గాలిగుట్ట దాయాదులు తరలిరావడంతో మద్దమ్మ ఆలయం కిటకిటలాడింది. ఆలయం వద్ద నిరూపమ్మ, కుమారుడు చక్రధర్‌రెడ్డిలు అన్నదానం ఏర్పాటు చేశారు.

గ్రంథాలయాలు ఉద్యమ దివిటీలు

పీలేరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం, సమాచార సాధనాలు లేని స్వాతంత్ర పోరాట సమయంలో గ్రంథాలయాలు ఉద్యమ దివిటీలుగా ఉండేవని పీలేరులోని శాఖ గ్రంథాలయాధికారి అమరనాథ్ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పీలేరు గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, డా.ఎస్.ఆర్.రంగనాథన్ సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, ప్యారూ ఖాన్, షేక్ షాహిర్ పాల్గొన్నారు.

ప్రముఖుల సేవలు చిరస్మరణీయం

కలకడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల సేవలు చిరస్మరణీయమని పాఠకులు అన్నారు. నేతల స్మరించడంలో భాగంగా ఆదివారం నాటి ఉద్యమానికి ఊపిరిపోసిన వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ అమర్‌నాథ్ పుస్తక ప్రియులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీవోస్ తాలుకా అధ్యక్షుడిగా రెడ్డి శేఖర్

మదనపల్లె అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె తాలుకా ఏపీ ఎన్జీవోస్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్జీవో కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికల అధికారిగా ఓబులేసు, సహాయ ఎన్నికల అధికారి వర్మ, పరిశీలకులుగా జిల్లా కన్వీనర్ శ్రీనివాసన్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా రెడ్డిశేఖర్, సహాధ్యక్షుడిగా బీఎం భాస్కర్, ఉపాధ్యక్షులుగా కె. ఆదివెంకటేశ్వర్లు, బీఎస్ శశి శేఖర్, ఎం. వెంకటరమణ, ఎన్ విజయకుమార్‌రెడ్డి, పి.నాగజ్యోతి, కార్యదర్శి ఎం. శివప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డి. హరికుమార్‌రెడ్డి, తదితర సభ్యులను ఎంపిక చేశారు. కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్రోపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, కార్యదర్శి నిత్యపూజయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కన్వీనర్, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

రేపు మాజీ సీఎం రాక

కలికిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నేత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మంగళవారం కలికిరి రానున్నారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప తెలి పారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి బయ లుదేరి మధ్యాహ్నం 2.35 గంటలకు ఆయన కలికిరి చేరుకుంటారని తెలిపారు. తిరిగి బుధవా రం సాయంకాలం 3 గంటలకు కలికిరి నుంచి హైదరాబాదు వెళ్లనున్నారు.

నేడు ధ్వజస్తంభం ప్రతిష్ఠ

గుర్రంకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్యలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమి పూజ

వాల్మీకిపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్త ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలో జాతీయ రహదారి పక్కగా శబరిమల అయ్యప్పస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. జాతీయ రహదారి పక్కగా నిర్మించనున్న అయ్యప్పస్వామి ఆలయం ప్రజలు, స్వామి భక్తుల సహాయ సహకారాలతో గొప్పగా చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలికిరి ఇన్‌స్పెక్టర్ బదిలీ

కలికిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కలికిరి ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్‌ని బదిలీ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. కలికిరి సీఐగా అన్నమయ్య జిల్లా రెడ్ శాండల్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏ ఎస్టీఎఫ్) సీఐ కె.రామచంద్రను నియమించారు. ఆగస్టు 9న కలికిరి సీఐగా బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ కేవలం మూడు నెలల్లోనే బదిలీ కావడం చర్చనీయాంశమైంది.

అనారోగ్యంతో బిల్ కలెక్టర్ మృతి



పీలేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ బిల్ కలెక్టర్ కె.మదనమోహన ఆచారి అనారోగ్యంతో ఆదివారం ఉదయం మరణించారు. కొంత కాలంగా అనారోగ్యంతో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం ఉదయం కన్ను మూసినట్లు పంచాయతీ కార్మికులు తెలిపారు. ఆయన మృతికి ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాశి వెంకటరామయ్య, పీలేరు కమిటీ నేతలు బీవీ రమణ, ఓబులేశు, నాగార్జున, పులి రెడ్డప్ప సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

పెద్దమండ్యం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బాలల హక్కులను పరిరక్షించాలని ఫోర్డు సంస్థ కోఆర్డినేటర్ ఆవుల నరసింహులు పిలుపు నిచ్చారు. సిద్దవరంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో సార్వత్రిక బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. గ్రామాల్లో పిల్లలు, పెద్దలతో కలిసి బాలల చైతన్య కార్యక్రమాలు, ఆటలు పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఫోర్డు సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బి.కొత్తకోటలో లక్షదీపోత్సవం

బి.కొత్తకోట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్తీకమాస సోమవారం లక్షదీపోత్సవం నిర్వహించనున్నారు. ఏటా కార్తీకమాసంలో శ్రీమహావిష్ణుసేన ఆధ్వర్యంలో ఈ వేడుక కనుల పండువగా నిర్వహించడం ఆనవాయితీ. సాయంత్రం నుంచి రాత్రి దాకా లక్షదీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకోవడానికి మహిళలకు అవకాశం కల్పిస్తున్నారు. పట్టణం నుంచే కాక చుట్టుప్రక్కల గ్రామాలు, మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దీపాలు వెలిగించనున్నారు. లక్షదీపోత్సవం ఏర్పాట్లలో భాగంగా పట్టణ వీధులన్నీ కాషాయమయ మయ్యాయి.